సూర్య

ఎలక్షన్ 2014

# మహా సంగ్రామం

సోమవారం 31 మార్చి 2014












ఈ ఒక్క సంవత్సర జయాపజయాల నిర్ణయం ఎన్నికల్లో పాల్గొనబోతున్న నాయకులకు మరో నాలుగేళ్లు పనిచేస్తుంది. దీనిపైనే తరువాతి సంవత్సరాల జీవితం ఆధారపడి ఉంటుంది. ఇప్పుడు విజయం సాధిస్తే ఇక తిరుగులేదు. అపజయం పొందితే మరో నాలుగేళ్లు(ఈ యేడు గాక) ఆగాల్సిందే. ఇది జయనామ సంవత్సరము. ప్రజలకి జయాన్నిస్తుంది. 60 సంవత్సరాలలో ఇది 28వ సంవత్సరము రెండు పన్నెండ్లు ఇరువది నాల్గు తీసివేయగా నాల్గవ భావానికి సంబంధించిన సంవత్సరము. సహజ చతుర్థమైన కర్కాటకములో 'గురుడు' ప్రవేశించే సంవత్సరము. సుఖము, ఆహారము, విద్య, నీరు ప్రజలకు అందే సంవత్సరము, కాలానికి అనుగుణంగా ఏ నాయకులు గ్రహగమనాలను అనుసరించి వీటిని ప్రజలకు అందించదలిచారో, నిజంగా అందించగలరో వారే ఈ సంవత్సరము విజయము పొందుతారు. కనుక ప్రజలనే దేముళ్ళు భావించే నాయకులు, దేమునికి మొక్కుకున్నట్లుగా ప్రజలకు సుఖశాంతులను, ఆహార పానియము లను అందించటానికి మొక్కుకుంటే ఆ నాయకులు 'జయాన్ని' పొందుతారు. మొక్కుకున్న కూడా మాటను నిలబెట్టుకోవాలి. 'మొక్కు' కదా? మరి తీర్చకపోతే దెబ్బతింటారు! అలా ప్రజలకి మేలు చేయదలచిన నాయకుల జాతకాలను విశ్లేషిస్తూ ప్రత్యేక కథనం. ఈ జయ నామ సంవత్సరం ఎవరికి జయం అందిస్తుందో, ఎవరికి అపజయం మిగుల్చుతుందో చూద్దాం..



# ఐదేళ్ల ఫలితాలు తేలేది ఈ యేడే...





## పదవిని అలంకరిస్తాడు

**నరేంద్ర మోడీ**



చంద్రరాశి ప్రకారము ఇతరుల లోపాలను గుర్తించి వాటిని వ్యక్తీకరించటంతో ఎక్కువ గుర్తింపు పొందుతారు. సూర్య రాశి వశాత్తు గురుడు అనుకూలస్థితిలో వున్నందున గౌరవాన్ని, పదవినీ సాధించే లక్షణాలు కొంతవరకు గోచరిస్తున్నాయి. గురుని ప్రభావం ఉచ్ఛోన్ముఖంగా వున్నందున 2013 సెప్టెంబర్ నుండి (చంద్ర మహాదశ / రాహు అంతర్ దశ / చంద్ర విదశ/ గురు సూక్ష్మదశ) మాట విలువ 100% శాతము వున్నందున స్నేహ సంబంధాలను, 88% వరకు ప్రయోజనాలను సమకూరుస్తున్నా రు. సహజంగానే భాగ్యధిపత్యం వహించిన చంద్రుని దశ 2010 నుండి కొనసాగుతున్న దృష్ట్యా, ఈ చంద్రునికి చతుర్థంలో వున్న గురుడు దశమాన్ని చూస్తున్న దృష్ట్యా పరస్పర కేంద్రస్థితి వల్ల. గజకేసరి యోగం, యోగించే సమయంగా వీర్ని గుర్తించవచ్చును. మొత్తము మీద వ్యయస్థానము పై గురుని దృష్టి, వ్యయాధిపతి దశమ స్థితి వున్నందున చేసే ఖర్చు మంచి ఖర్చు. ఆ ఖర్చు అతని గౌరవానికి, పదవికి వుపయోగపడటం అనే లక్ష్యాలు గోచరిస్తున్నాయి. గురుదు ఒక వైపుగా ప్రజోపయుక్తమైన ఖర్చు లక్షణాన్ని, మరొకవైపు దానికి తగిన గౌరవాన్ని పెంచే వాడిగా కనిపిస్తున్నాడు. ప్రతి పైసా, ఖర్చు సద్వినియోగం చేసే బాటలో ఇతను ముందడుగు వేస్తారు! వీరికి ఆత్మవిశ్వాసము, మాట విలువ జనసహకారము, పోటీలో విజయాలు అనే అంశాలు ఎక్కువ బలంగా కలిగినదిగా సూచిస్తున్నందున బలబలాలను పరిశీలించినప్పుడు వీరు సాధించే విజయాలు ప్రజలకి సహకరించేవిగాను, ప్రసంశ సమాజంలో గుర్తింపు తెచ్చేవిగాను గోచరిస్తున్నాయి. మాటల్లో విశ్వసనీయత సమాజం చేత గుర్తించబడుతుంది.







## గౌరవం పెరుగుతుంది

**నారా చంద్రబాబునాయుడు(20.04.1950)**




సంప్రదాయ జ్యోతిషం ప్రకారం వృషభరాశి, పాశ్చాత్య పద్ధతులననుసరించి మేషరాశి లక్షణాలను కలిగిన వ్యక్తిగా తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబుని చెప్తాము. కార్యసాధనలో చురుకుదనం, ఔన్నత్యము, ప్రతి పనిలోను ఎక్కువ ప్రయాస, ఉత్సాహము, రజోగుణము అధికము. కృషిశీలురు, సంచారము, స్ఫురణశక్తి, నాయకత్వ లక్షణములు, పట్టుదల ఎక్కువగా వుంటాయి. కొత్త విషయాలను తెలుసుకోవాలనే ఆసక్తి, ఆటంకాలను ఎదుర్కొనే శక్తి, స్పష్టమైన లక్ష్యాలు ఏర్పరచుకొని వాటిని సరిగ్గా సాధించగలిగిన క్రమశిక్షణా, ప్రజ్ఞా, మేధస్సులు అత్యధికంగా వుంటాయి. వీరి మానసిక స్థితి నిశ్చితమైనదిగా వుంటూ తమ లక్ష్యము నుండి చలించనిదిగా ఉంటుంది. ఎదుటివారిని సులభంగా ఆకట్టుకునే ప్రవర్తన వీరి శైలిలో వుంటుంది. జీవితంలో చాలా సాధించాలన్న తపనతో తన మనోభావాలు బయటకు చెప్పరు. కొన్నిసార్లు మిత్రులే తనకి శత్రువులయ్యే అవకాశముంది. వీరికి ఓర్పు అధికంగా ఉన్న కోపం కూడా తీవ్రమే. వీరికి స్థిరమైన అభిప్రాయాలు. ప్రతిపనిలో బాధ్యత వహించే లక్షణాలు, శ్రమకు వెనుకాడని మనస్తత్వము, సూక్ష్మవిషయాలను బాగా పరిశీలించటం లో వీరి జీవితానుభవమే వీరికి ఎక్కువగా సహాయపడుతుంది. ముఖ్యంగా వీరు ఒక విషయాన్ని దృష్టిలో పెట్టుకుంటే అది సాధించేదాకా దృష్టి మార్చరు. వేరే విషయాలను గూర్చి అస్సలు ఆలోచించరు. తాను అనుకున్నది సాధించే దాకా ధైర్యసాహసములు, చొరవ, తెగింపు, పౌరుషము వీరికి పెట్టుబడి. వీరి అభిమానానికి, ఆత్మగౌరవానికి భంగము కలిగితే చాలా తీవ్రంగా స్పందిస్తారు.



## కొత్త మార్గాల అన్వేషణ

**కె.చంద్రశేఖర్‌రావు (17.02.1954)**



టిఆర్ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావు సంప్రదాయ జ్యోతిషం ప్రకారం కర్కాటకరాశి. పాశ్చాత్య పద్ధతులను అనుసరించి కుంభరాశి లక్షణాలను కలిగిన వ్యక్తి. ఇతరులు ఏమనుకుంటారో, ఏమంటారో అన్న భావనతో వీరి ప్రవర్తన అతి జాగ్రత్తగా వుంటుంది. ఓర్పు కొంచెం తక్కువ, వీరి మనస్తత్వము త్వరగా ఇతరులకు అర్థము కాదు. ఇతరులతో పోటీ ఉంటే గొప్ప గొప్పకార్యాలు చేస్తారు. కొత్త మార్గాలను అన్వేషిస్తారు. మానవత్వపు విలువలకు ప్రాధాన్యతనిస్తారు. వీరి లక్ష్యసాధనో ఎన్ని అడ్డంకులు వచ్చిన అవి తనకు అనుకూలంగా వచ్చే వరకూ ఎదురు చూచి అనుకూల వాతావరణం ఏర్పడగానే లక్ష్యసాధన చేస్తారు. చిన్న చిన్న విషయాలలో తప్పు జరిగినా విపరీతంగా బాధపడతారు. సున్నితమైన మనస్సు, తెలివితేటలు అధికం, ఎదుటి వ్యక్తి కష్టనష్టాలను తెలుసుకొని ప్రవర్తిస్తారు. వీరికి ఆలోచనలు అధికం. ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఆదర్శాలను వదలక వాటికై కృషి చేస్తారు. చాలా మెతకవారు, జాలి, దయ , కరుణ కలిగి వుంటారు. నిరాడంబరంగా, నిజాయితీగా ఉంటారు. ఏదైనా సాధించదలిస్తే గట్టి పట్టుపట్టి సాధించే దాకా నిద్రపోరు. మొసలికన్నీరు కార్చడం తెలియనివారు. వీరు చక్కని ఉపన్యాసకులు. రాజకీయ వేత్తలు తన జీవితంలో అనుభవాలు, అనుభూతుల్ని ఒక పట్టాన మర్చిపోరు. ప్రతిదీ ఆలోచించి ఆచరించడం వీరి లక్షణం. తనకి చేసిన కీడు, మేలు కూడా మరువరు. మంచి వాగ్ధాటి కలవారు. పొదుపు పాటిస్తారు. పైకి మెత్తగా కనిపించిన అవసరమైనప్పుడు ధైర్యసాహసాలు చూపిస్తారు. పాత అంటే పడదు.





## నిర్ణయాల్లో ఆలస్యం

**వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి (21.12.1972)**



వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్‌రెడ్డిది సంప్రదాయ జ్యోతిషం ప్రకారం మిధునరాశి, పాశ్చాత్య పద్ధతులననుసరించి ధనురాశి లక్షణాలను కలిగిన వ్యక్తిగా వీరి మాటలలో హాస్యప్రియాత్మకం, చమత్కారం కనిపిస్తుంది. వీరిలో సృజనాత్మకశక్తి అధికం. కొన్నిసార్లు తమ అభిప్రాయాలకు తాను వ్యతిరేకంగా ఆలోచనలు చేస్తుంటారు. పరిస్థితులు అనుకూలంగా లేనపుడు అనుకూల వాతావరణం ఏర్పడేదాకా ఎంతకాలమైనా ఓర్పు వహిస్తారు. ఆపదల్ని అధిగమించే నేర్పు, లక్ష్యాన్ని సాధించే ప్రజ్ఞ వీరి ముఖ్య లక్షణాలు. కార్యసాధనకై ఎంతటి నష్టాలైనా ఓర్చుకోగలరు. వీరికి నచ్చనివాటికి కృషి చేయరు. పట్టుదల, ఏకాగ్రత అధికంగా ఉంటాయి. వీరి సూటి ప్రవర్తనవలన కొందరితో వైరుధ్యం ఏర్పడుతుంది. వీరికి మనసులో ఎన్ని బాధలున్నా ఓర్పుతో నిగూఢంగా ఉంటారు. వీరిలో వాదనాపటిమ అమోఘం. మనసులోని మాటలు ధైర్యంగా వ్యక్తీకరించగలరు. వీరి ప్రవర్తన న్యాయబద్ధం అవడం వల్ల అందరూ నమ్ముతారు. క్రమశిక్షణా లోపంతో శక్తిని వృధా చేసుకుంటారు. తమకు తెలియకుండానే బాగా శ్రమిస్తారు. అలసట వీరికి తెలియదు. ఏ విషయమైనా ఇట్లే గ్రహించటం వన అనేక విషయాల్లో ప్రజ్ఞ కలిగివుండడం వీరి మరో లక్షణం. మంచి పలుకుబడి, గౌరవం కలవారగుదురు. వీరి ఆలోచనలు సాధారణంగా నిజమవుతాయి.


(మరికొందరు ప్రముఖ నేతల పంచాంగం 2,3లో)


# నిరాడంబర నేత

ఆదర్శ నేత

- సైకిల్‌పై పార్లమెంట్‌కు వెళ్లిన పుచ్చలపల్లి
- రెడ్డి అయినా సుందరయ్యగానే గుర్తింపు
- సాయుధ రైతాంగ పోరాటంలో ముఖ్యుడు
- ఆకాశానికెదిగినా ఒదిగి ఉండే తత్వం
- ప్రశ్నలతో పాలకులకు ముప్పు తిప్పలు
- సిపిఎంకు తొలి ప్రధాన కార్యదర్శిగా ప్రఖ్యాతి

*తెలుగుజాతి ఉత్తమ పుత్రుల జాబితా ఎంత కుదించి రూపొందించినా అందులో తప్పక ఉండే పేరు ఆయనది. ప్రజా జీవితంలో ప్రమాణాల గురించి అనుకున్నప్పుడల్లా అందరూ ప్రథమంగా తల్చుకునే మహత్తర వ్యక్తిత్వం ఆయన సొంతం. నీతి, నిజాయతీ, నిరాడంబరత, నిస్వార్థత, నిబద్ధత, నిష్కల్మషత్వం, సాహసం, సమర్థత వంటి వాటన్నింటి నిలువుటద్దం ఆయన. అందుకే ఆయనను కమ్యూనిస్టు గాంధీ అంటారు. ఆయనే పుచ్చలపల్లి సుందరయ్య(మొదటి పేరు సుందర రామిరెడ్డి). క్లుప్తంగా పీఎస్. కమ్యూనిస్టులు కాని వారికైనా ఆయన కామ్రేడ్ సుందరయ్యే.*

1913లో నెల్లూరు జిల్లా అలగానిపాడులో ప్రపంచ కార్మిక దినోత్సవం మే1న పుట్టిన సుందరయ్య తండ్రి వెంకట్రామిరెడ్డి. తల్లి శేషమ్మ. ఏడుగురు పిల్లల్లో ఆయన ఆరోవారు. భూస్వామ్య కుటుంబమైనా భూమి సతల్లి బిడ్డలైన శ్రమజీవుల గురించి ఆలోచించేవారు. బాల్యంలో బావతో పాటు తిరుగుతూ రాజమండ్రి, మద్రాసులాంటి చోట్ల చదువుకున్నారు. మొదట్లో పుస్తకాలకే పరిమితమైనా... తర్వాత స్నేహితుల ప్రభావంతో పత్రికలు చదివి దేశభక్తి భావాలు అలవరుచుకున్నారు. స్వాతంత్రోద్యమంలో పాల్గొనేందుకు ఇంట్లో ఉత్తరం రాసిపెట్టి బయలుదేరారు. పశ్చిమగోదావరి జిల్లాలోని వివిధ శిబిరాల్లో ముఖ్యపాత్ర నిర్వహించారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. నెల్లూరు నుంచి వచ్చిన రెడ్డి ఏదైనా చేస్తాడనే పేరు సంపాదించాడు. అయితే తర్వాత పేరులోంచి రెడ్డిని ఆయన తొలగించేశారు.

**చెట్టెక్కాడు... జెండా పాతాడు**

కల్లు వ్యతిరేక ఉద్యమంలో ఎవరూ ఎక్కలేని ఎత్తయిన చెట్టుపైకి ఎక్కి పతాకం ఎగురవేశాడు. కాలు జారి చీరుకుపోయి రక్తం ధార కట్టినా వెనక్కు తగ్గలేదు. పోలీసులు దాన్ని పీకి పారేయాలన్నా చెట్టు ఎక్కలేక తుపాకీతో కాల్చివేశారు. ఈ ఉద్యమం సందర్భంగానే 1930 జూన్‌లో మాలపద్రులో ఆయనను అరెస్టు చేసి తంజావూరులో బాల నేరస్థుల కారాగారానికి పంపించారు. తర్వాత రాజమండ్రికి మార్చారు. అష్టకష్టాలు పడుతున్నాడని తెలిసి కుటుంబసభ్యులు విడిపించడానికి ప్రయత్నిస్తే కోర్టులో మాట్లాడకుండా సహాయ నిరాకరణ చేశారు. బెంగుళూరులో బావ దగ్గర ఉంటూ చదువుకుంటున్నప్పుడే... దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు ద్యమ నిర్మాణానికి కృషిచేస్తున్న అమీర్ హైదర్‌ఖాన్ కబ్బన్‌ను పార్కులో కలుసుకున్నారు. తల్లికి ఇచ్చిన మాట ప్రకారం ముందు ఇంటర్ పూర్తి చేస్తానని సుందరయ్య చెప్పారు. కాని కబ్బన్ పార్కులోని గ్రంథాలయాన్నే తన అధ్యయనానికి సోపానం చేసుకున్నారు. తర్వాత చదువు పూర్తి చేయడం కన్నా దేశంకోసం పోరాడటమే ముఖ్యమని నిర్ధారణకు వచ్చారు. 1934లో ఆయన ద్వారానే కమ్యూనిస్టు అయ్యాడు. ఊరికి తిరిగొచ్చి సేవా కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా దేశంలో తొలి వ్యవసాయ కార్మిక సంఘాన్ని స్థాపించారు. హైదర్‌ఖాన్ అరెస్టు తర్వాత సుందరయ్యే దక్షిణ భారతాన కమ్యూనిస్టు పార్టీ స్థాపన బాధ్యత తీసుకున్నారు. పార్టీలో కేంద్ర కమిటీ సభ్యుడయ్యారు.

**సాయుధ రైతాంగ పోరాటం :** అవిభక్త మద్రాసు రాష్ట్రంలోని ఆంధ్ర ప్రాంతంలో దేశభక్త యువతతో సంబంధాలు పెట్టుకుని సంఘటిత పరిచిన సుందరయ్య కాంగ్రెస్ తర్వాత ప్రధాన రాజకీయశక్తిగా కమ్యూనిస్టు పార్టీని తీర్చిదిద్దారు. ప్రసిద్ధులైన కమ్యూనిస్టు నేతలలో ఎక్కువమంది ఆయన ద్వారా వచ్చినవారే. కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లోనూ పార్టీకి పునాదులు వేశారు. కార్మిక సంఘాలు, రైతుకూలీ సంఘాలు ఏర్పాటు చేశారు. క్రమేణా చంద్ర రాజేశ్వరరావు, మాకినేని బసవ పున్నయ్య, మద్దుకూరి చంద్రశేఖర్‌రావు వంటి వారితో ఒక బలమైన సమష్టి నాయకత్వం ఆవిర్భవించింది. 1946లో విశాలాంధ్రలో ప్రజారాజ్యం అని పిలుపునిచ్చిన సుందరయ్య రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన మహత్తర దార్శనికత కనబరిచారు. క్రమేణా ఈ ప్రభావం నిజాం నిరంకుశత్వంతో మగ్గుతున్న తెలంగాణా ప్రాంతానికి పాకి సుప్రసిద్ధమైన సాయుధ రైతాంగ పోరాటాన్ని రగిలించింది. ఆ పోరాటంలో (మిగతా 2, 3లో)



| | |
|---|---|
| అసలు పేరు | పుచ్చలపల్లి సుందరరామిరెడ్డి |
| పుట్టిన తేదీ | 1 మే 1913 |
| ప్రాంతం | నెల్లూరు |
| మరణం | 19 మే 1985 |
| ఇతర పేర్లు | సుందరయ్య, కామ్రేడ్ పిఎస్ |
| వృత్తి | రాజకీయాలు |
| పార్టీ | సిపిఎం |
| భార్య | లీల |




### తెలంగాణలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు

| | |
|---|---|
| ఎన్నికల నోటిఫికేషన్ | ఏప్రిల్ 2 |
| నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ | ఏప్రిల్ 9 |
| నామినేషన్ల పరిశీలన | ఏప్రిల్ 10 |
| ఉపసంహరణకు చివరి తేదీ | ఏప్రిల్ 12 |
| పోలింగ్ తేదీ | ఏప్రిల్ 30 |

### సీమాంధ్రలో లోక్ సభ, అసెంబ్లీ ఎన్నికలు

| | |
|---|---|
| ఎన్నికల నోటిఫికేషన్ | ఏప్రిల్ 12 |
| నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ | ఏప్రిల్ 19 |
| నామినేషన్ల పరిశీలన | ఏప్రిల్ 21 |
| ఉపసంహరణకు చివరి తేదీ | ఏప్రిల్ 23 |
| పోలింగ్ తేదీ | మే 7 |


